# ఆ దేవుడు

దేవుని గురించి ప్రతి మానవుని మస్తిష్కంలో అసలు దేవుడున్నాడా? ఉంటే ఎలా ఉంటాడు? ఎక్కడున్నాడు? ఉంటే ఎందుకు కనిపించటం లేదు? దేవుడొక్కడే ఇంత పెద్ద విశ్వ సామ్రాజ్యాన్ని ఎలా నడపగలడు? అనే రకరకాల సందేహాలు వస్తూ వుంటాయి. ఇంకా దేవుణ్ణి చూడకుండా ఎలా విశ్వసించేది? దేవుడు మా ముందుకు రావాలి. రోజూ కాకపోయినా వారానికో, నెలకో ఒక తూరి కనపడాలి. అసలు దేవుడొక్కడా, లేక అనేక దేవుళ్ళా? ఇలాంటి ఎన్నో సందేహాలకు సరియైన, సహేతుకమైన సత్యంతో కూడుకున్న సమాధానాలు, ఒక్క ఇస్లాంలో తప్ప మరే మతంలోనూ, దివ్యఖుర్ఆన్‌లో తప్ప మరే గ్రంథంలోనూ బహుశా దొరకవు.

ఎవరైతే సత్యాన్ని ప్రేమిస్తారో, ఎవరిలోనైతే సత్యం గ్రహించాలనే జిజ్ఞాస ఉందో, ఎవరైతే రుజు మార్గంలో ఉండాలనుకొంటారో, ఎవరైతే ఇహ-పరలోకాలలో సాఫల్యం పొందాలనుకుంటారో, వారు తప్పకుండా ఇస్లాంను అధ్యయనం చేయాలి. దేవుడు ఏనాడైతే ఆది దంపతులైన ఆదం, హవ్వాలను పంపాడో ఆనాడే ఆయన ఇలా ప్రకటించాడు: **"మీరంతా ఇక్కడ నుంచి దిగిపోండి, ఇకపై నా తరఫు నుండి ఏదైనా ఉపదేశం (మార్గదర్శకత్వం) మీవద్దకు వచ్చినప్పుడు, నా ఈ ఉపదేశాన్ని అనుసరించేవారికి ఏ విధమైన భయంకాని, దుఃఖం కాని ఉండదు."**

(అల్ బఖర: 38)

ఆదం, హవ్వాలు ఒకే ఒక దేవుడైన అల్లాహ్‌నే విశ్వసించారు. ఆయన్నే ఆరాధించారు. మొదట్లో మానవులందరు ఏకేశ్వరోపాసకులే. రాను రాను మానవులు పెరుగుతూ వచ్చినట్లే దేవుళ్ళను కూడా పెంచుకుంటూ వచ్చారు. **"ప్రారంభంలో మానవులంతా ఒకే సముదాయంగా ఉండేవారు. తరువాత వారు విభిన్న విశ్వాసాలు, ఆచారాలు కల్పించుకుని చీలిపోయారు. నీ ప్రభువు వైపున ముందే ఒక మాట నిర్ణయించబడి ఉండకపోతే, వారు పరస్పరం విభేదించుకుంటున్న విషయాలు ఎప్పుడో పరిష్కరించబడి ఉండేవి".**

(యూనుస్ :19)

**"మీ సమాజం (ధర్మం) నిజానికి ఒకే సమాజం, నేను మీ ప్రభువును, కనుక మీరు నన్నే ఆరాధించండి, కాని ఆ ప్రజలు పరస్పరం విభేదించుకుని తమ ధర్మాన్ని చీలికలు పేలికలుగా చేసుకున్నారు. అయితే చివరికి అందరూ మా దగ్గరికి రావలసి ఉంది."** (అంబియా: 92,93)

## దేవుడున్నాడు

దేవుడున్నాడని ఈ అనంత విశ్వంలోని ప్రతి అణువూ సాక్ష్యమిస్తుంది. ఈ ప్రకృతిలోని ప్రతి వస్తువు అల్లాహ్ అస్తిత్వానికి నిదర్శనం. ఆలోచించేవారికి ఈ భూమ్యాకాశాల నిర్మాణంలోను, సూర్య చంద్రుల క్రమ బద్ధీకరణలోను, మానవ పుట్టుక, జంతుజాలం- ఇలా ఎన్నో నిదర్శనాలున్నాయి. **"దేవుడు భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఒక నిర్ణీతకాలం కొరకు సత్యబద్ధంగా సృష్టించాడు కాని చాలా మంది తమ ప్రభువును కలుసుకోవలసి ఉందన్న సత్యాన్ని నిరాకరిస్తున్నారు"** (రూమ్ :8)

**భూమ్యాకాశాల్లోని ఏ వస్తువూ దేవునికి కానరాకుండా మరుగుగా లేదు. ఆయనే స్త్రీల గర్భాలలో మీ రూపురేఖల్ని తాను తలచిన విధంగా రూపొందించేవాడు. అపార భక్తి సంపన్నుడు, అద్భుత వివేచనాపరుడయిన ఆ స్వామి తప్ప (మీకు) మరో ఆరాధ్యుడు లేదు.** (ఆలి ఇమ్రాన్:5,6)

ఈ సృష్టిలోని ప్రతి అణువు ఒకే దేవుడ్ని ఆరాధిస్తోంది. "భూమ్యాకాశాల్లోని యావత్తు సృష్టిరాసులు ఆయన పవిత్రతను కొనియాడుతున్నాయి. ఆయన ఔన్నత్యంతో పాటు ఆయన పవిత్రతను ప్రశంసించని సృష్టి అంటూ ఏదీ లేదు. కాని అవి చేసే దైవస్మరణను మీరు గ్రహించలేరు. నిస్సందేహంగా ఆయన ఎంతో ఉదారుడు, గొప్ప క్షమాశీలి. (బనీ ఇస్రాయీల్: 44)

## దేవుని విశ్వసించడం

ఎవరైతే ఆలోచించకుండా దేవుని విశ్వసిస్తారో వారి విశ్వాసం బలహీనంగా ఉంటుంది. అల్లాహ్ తన గ్రంథమైన ఖుర్ఆన్‌లో తన దాసులను ఎన్నోసార్లు తను సృష్టించిన ఈ సృష్టిలోని అనేకానేక నిదర్శనాలను 'చూడండి, ఆలోచించండి' అని పిలుపు ఇస్తున్నాడు:- **"మానవులారా! మీ ఆరాధ్య దైవం ఒక్కడే. కరుణామయుడు, కృపాసాగరుడయిన ఆ దేవుడు తప్ప (మీకు) మరో దేవుడు లేదు. భూమ్యాకాశాల సృజనలో, రేయింబవళ్ళ చక్రభ్రమణంలో, సముద్రాలలో పయనిస్తూ మానవులకు ప్రయోజనం చేకూర్చే ఓడలలో, దేవుడు పై నుంచి కురిపించే వర్షపు నీటిలో, తద్వారా ఆయన మృతభూమికి జీవం పోసే ( చెట్లూ చామల్ని పచ్చదనం చేసే) పనిలో, పుడమిపై పలువిధాల జీవరాసుల్ని విస్తరింప జేసే ఆయన సృష్టి నైపుణ్యంలో, గాలుల సంచారంలో, నేలకు-నింగికి మధ్య నియమ బద్ధంగా సంచరించే మేఘాలలో బుద్ధిమంతులకు (దేవుని అస్తిత్వాన్ని, ఆయన ఏకత్వాన్ని తెలిపే) అనేకానేక నిదర్శనాలున్నాయి.** ( బఖర : 163,164)

ఎవరైతే దేవుడు సృష్టించిన ఈ విశ్వంలోని అణువణువును పరికించి, పరిశోధించి, తర్కించి, ఆలోచించి దేవుని విశ్వసిస్తారో వారి విశ్వాసం బలంగా ఉంటుంది. వారు దేవుని ఆజ్ఞలను తూ.చ తప్పకుండా శిరసావహిస్తారు.

## దేవుడు - ఈనాటి మనిషి

**మానవుల్లోని కొందరు జ్ఞానముండీ అజ్ఞానుల్లా దేవుని ధిక్కరిస్తున్నారు. దేవుని దాసులను దేవుని నుంచి దూరం చేస్తున్నారు. దేవుని విశ్వసించని వారు దేవుని అస్థిత్వానికి ఏమీ నష్టపరచలేరు. ఆయన సామ్రాజ్యంలో ఏ లోటూ రాదు. వారు తమకు తామే నష్టపరచుకుంటారు. బాగా గుర్తుంచుకోండి! ఎవరైతే దేవుణ్ణి ధిక్కరిస్తారో వారు ఎవరికీ మిత్రులు కాలేరు. తమకు తాము కూడా మిత్రులు కాలేరు. అసలు వారు తమ అస్థిత్వాన్నే ధిక్కరిస్తున్నారు. దేవుడే లేకుంటే ఏమీ లేదు. "మీరు అల్లాహ్ పట్ల తిరస్కారవైఖరి ఎలా అవలంబిస్తారు? వాస్తవానికి ప్రాణం లేని మీకు ఆయన ప్రాణం పోసాడు. మళ్ళీ మీ ప్రాణాన్ని తీసేదీ ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేదీ ఆయనే. చివరకు మీరంతా ఆయన వద్దకు మరలిపోతారు.**

(అల్ బఖర : 28)

మానవులలో ఎక్కువ శాతం మంది ఒక్కడైన నిజదేవుని వదిలేసి రకరకాల అనేక దేవుళ్ళను కొలుస్తున్నారు. విద్యావిజ్ఞానాలు లేని ఆ రోజుల్లో మానవులు ఆపదల బారి నుండి, వ్యాధుల బారి నుండి రక్షణ పొందేందుకు వేరు, వేరు దేవుళ్ళను చేసుకున్నారు. కాని శోచనీయమైన విషయమేమిటంటే, విద్యా విజ్ఞానాలు సర్వ సామాన్యమైన ఈ రోజులలో కూడా దేవుని నిదర్శనాలను పరికించి, పరిశోధించి, ఆలోచించే శక్తిని కలిగి ఉండి కూడా మానవులు నిజ దేవుని వదలి దేవుని సృష్టితాలను కొలుస్తున్నారు.




## ఒకరి కంటే ఎక్కువ దేవుళ్ళుంటే?

ఒకవేళ అనేక దేవుళ్ళే ఉండి ఉంటే ఈ సృష్టి ఛిన్నాభిన్నమయ్యేది. ఎందుకంటే వీరి అభిప్రాయాలు భిన్నంగా ఉండేవి. ఒకరికి నచ్చినది వేరొకరికి నచ్చేది కాదు. మీరెప్పుడైనా ఈ ఆకాశం, భూమి సూర్యచంద్రులు, గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రాలు గురించి ఆలోచించలేదా? వాటికి విధించబడిన హద్దుల్లో ఇవి పరిభ్రమణం చెందుతున్నాయి. ఒక క్రమ పద్ధతిలో నడుస్తున్నాయి. **"వారు తమ పైనున్న ఆకాశాన్ని పరికించి చూడలేదా? ఏవిధంగా మేము దాన్ని నిర్మించి తీర్చి దిద్దాము? అందులో ఎక్కడా ఎలాంటి రంధ్రం గాని, నెర్రగాని లేదు".** (ఖాఫ్ : 6)

**"చంద్రుని కోసం మేము మజిలీలు (చంద్రకళలు) నిర్ణయించాము. అది వాటిని దాటుకుంటూ చివరికి వాడిపోయిన పాత ఖర్జూరపు మండలా మారిపోతుంది. చంద్రుని పట్టుకునే శక్తి సూర్యునిలో లేదు. అలాగే రాత్రి పగటిని దాటిపోలేదు. సమస్తం ఒక్కొక్క కక్ష్యల్లో (అంటే తమ, తమ నిర్ణీత కక్ష్యల్లో) సంచరిస్తున్నాయి".**

(యాసీన్ : 39, 40)

ఒకవేల ఒకే దేవుడు కాకుండా అనేక మంది దేవుళ్ళు ఉండి ఉంటే ఇంతవరకు ఏ ఒక్కటి మిగిలేదు కాదు. **"భూమ్యాకాశాల్లో ఒక్క దేవుడే కాకుండా ఇతర దైవాలు కూడా ఉండి ఉంటే భూమ్యాకాశాల వ్యవస్థ (ఎప్పుడో) విచ్ఛిన్నమైపోయి ఉండేది. వారు కల్పిస్తున్న వాటికి విశ్వసామ్రాజ్య సింహాసనాధీశుడైన దేవుడు ఎంతో అతీతుడు, పరమ పావనుడు.** ( అంబియా: 22)

## దేవుడు మరియు ఖుర్ఆన్

దివ్యఖుర్ఆన్ దేవుని నిదర్శనం. మానవుల రుజుమార్గం కొరకు దేవుని తరపు నుంచి అవతరించిన గ్రంథాలలో చిట్టచివరి గ్రంథం. ఇక ప్రళయం వరకు ఏ గ్రంథం అవతరించదు. ఈ గ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను మంచీ చెడులను వేరుపరచే స్పష్టమైన బోధనలున్నాయి.

(బఖర: 185)

ఈ గ్రంథం దేవుని అస్తిత్వం దేవుని ఏకత్వం ఇహం, పరం, ముహమ్మద్(సల్లం) దౌత్యం, మరణాంతరజీవితం, ప్రళయం, స్వర్గం, నరకం, జీవిత పరమార్థం, దైవదూతలు, దైవప్రవక్తలు, దివ్యగ్రంథాలు, కర్మలు (ఆచరణలు), విధి నిర్ణయం, పాప పుణ్యాలు, కష్ట సుఖాలు, మిథ్యాదైవాలు, రాజకీయ విధానం, ఆర్థిక విధానం, నీతి శాస్త్రం (నైతిక విధానం) సామాజిక జీవితం, విజ్ఞానశాస్త్రం (సైన్సు), ఆరాధనలు దానధర్మాలు మొదలగు వాటన్నిటిపై చర్చిస్తుంది. మానవునికి సరియైన మార్గం చూపుతుంది.

ప్రపంచంలోని ఇతర మతగ్రంథాలు ఎన్ని మార్పులకు చేర్పులకు గురైనప్పటికిన్నీ, దేవుడున్నాడని, దేవుడొక్కడేనని ఇప్పటికీ ఘోషిస్తున్నాయి. కాని వాటిని చదివి పరిశోధించి, ఆలోచించి విశ్వసించేవారే కరువయ్యారు. పూర్వ గ్రంథాలు ఏ దేవుని పరిచయం చేశాయో దివ్యఖుర్ఆన్ కూడా ఆ దేవుడ్నే పరిచయం చేసింది. ఆయనే అల్లాహ్. ఇది ముస్లిములు ఉపయోగించే పదమని ఆయన ముస్లిముల దేవుడని అపోహకు లోనుగాకండి.

ఈ ప్రపంచంలో దేవునికి అల్లాహ్ తప్ప వాడే వేరే ఇతర పదాలు బహుదైవాలుగా మారే ప్రమాదముంది. ఉదా:- దేవుడు-దేవుళ్ళు. దేవతలుగా **గాడ్ - గాడ్స్**గా మారవచ్చు కాని అల్లాహ్ అనే పదంలో బహువచనం చోటు చేసుకోదు. **"అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు, ఆయన సకల లోకాలకు ప్రభువు".** (ఫాతిహా: 1)

ఈ విధంగా అల్లాహ్ గురించి, ఆయన ఔన్నత్యం గురించి, ఆయన కీర్తనల గురించి, ఆయన అనుగ్రహాల గురించి రాసుకుంటూపోతే ఈ వ్యాసాలు సరిపోవు. ఈ పరిమితమైన జ్ఞానం సరిపోదు. మీకు అల్లాహ్ చిరునామా కావాలంటే ఆయన ఎప్పటి నుంచి ఉన్నాడు? ఆయన ఎక్కడున్నాడు ? ఆయన ఈ ప్రకృతిని ఎందుకు సృష్టించాడు? ఆయన మానవులను ఇతర జీవులను ఎందుకు సృష్టించాడు? ఇలాంటి ఎన్నో సందేహాలకు సమాధానాలు కావాలంటే దివ్యగ్రంథమైన ఖుర్ఆన్‌ను ఆశ్రయించండి. నిష్కల్మషమైన మనసుతో దాన్ని చదవండి. ఈ సృష్టిని పరికించి చూడండి. ఆలోచించండి. మీ సందేహాలన్నింటికీ సమాధానాలు దొరుకుతాయి. మీ మనసు దీని పట్ల తృప్తి చెందితే మరి ఆలస్యం చేయకండి. అల్లాహ్‌ను విశ్వసించండి. ఒకవేళ మీరు సత్యాన్ని గ్రహించి కూడా విశ్వసించకుండా ఉంటే బలవంతమేమీ లేదు. ఎందుకంటే **"ఇస్లాం ధర్మ స్వీకరణలో ఎలాంటి బలవంతం బలాత్కారాలు లేవు".** (బఖర : 256)

అల్లాహ్ తన ఈ విశ్వసామ్రాజ్యంలో భూమ్యాకాశాలను, వాటి మధ్యన ఉండే ప్రతి వస్తువును మానవుల కోసం సృష్టించాడు. మానవులకు సుఖాలు సౌలభ్యాలు పొందడానికి కావలసిన జ్ఞానం తెలివి తేటలను అనుగ్రహించాడు. మరి అలాంటి కరుణామయుడైన అల్లాహ్‌కు కృతజ్ఞులయి ఉండటం మానవుల విద్యుక్త ధర్మం కాదా?

అల్లాహ్ తన అపారమైన అనుగ్రహాలనిచ్చి మానవులను ఇలా ప్రశ్నిస్తున్నాడు: **జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు యొక్క ఏఏ అనుగ్రహాలను తిరస్కరించగలరు?** ( రహ్మాన్ :13)

■